ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 01.09.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

2. ఆరోగ్యవంతమైన, పోషకాహారం అందుకున్న సమాజంతోనే అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం సాధ్యమవుతుందని ఈరోజు పోషణ్ మాహ్ ను ప్రారంభించిన సందర్భంగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ పేర్కొన్నారు.

3. చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల దరఖాస్తుల గడువును ప్రభుత్వం మరో 15 రోజుల పాటు పొడిగించింది.

4. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు.

5. సెప్టెంబర్‌లో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**కిషన్ రెడ్డి**

తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ , జడ్చర్ల రైల్వే స్టేషన్‌లలో ఆధునీకరణ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .. రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు లైన్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయని , కర్నూలు వరకు కూడా త్వరలో పూర్తవుతాయని చెప్పారు. 2014లో ఉమ్మడి ఏపీ కోసం ఏడాదికి 886 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా , ఈ ఏడాది తెలంగాణ కోసం 5 వేల 454 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పూర్తి కానుందని , దేశ వ్యాప్తంగా ప్రకటించిన 7 బుల్లెట్ రైళ్లలో 3 తెలంగాణకు లభించాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

డెస్క్

**లక్ష్మణ్**

హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ కాలేజీలో ఐదు రోజుల పోషణ మాహ్ కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ఈ ఉదయం ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షించిన అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం ఆరోగ్యవంతమైన , పోషకాహారం అందుకున్న సమాజంతోనే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 2014కు ముందు 38 శాతానికి పైగా చిన్నారులు సరైన పోషకాహారం అందక ఎదుగుదల లోపాలతో బాధపడేవారని, పునరుజ్జీవం పొందిన జాతీయ పోషకాహార మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తోందని లక్ష్మణ్ తెలిపారు. పాశ్చాత్య ఆహారపు అలవాట్లకు బదులు సంప్రదాయ భారతీయ ఆహారాన్ని అనుసరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బైట్ ... లక్ష్మణ్, **MP, RAJYASABHA**

సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార , ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహిస్తున్నాయి.

డెస్క్

**రేవంత్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు , రేపు ఢిల్లీలో పర్యటించనున్న ముఖ్యమంత్రి కొద్దిసేపటిక్రితం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ మధ్యాహ్నం పలువురు కేంద్ర మంత్రులను కలిసి.. రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై చర్చలు జరుపుతారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో , మామునూరు విమానాశ్రయం పురోగతిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో సీఎం సమావేశం అవుతారు. డిఫెన్స్ కంపెనీలతో ఒప్పందాల విషయమై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలుస్తారు.

పిటిసి, హైదరాబాద్

**చేయూత**

చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల దరఖాస్తుల గడువును ప్రభుత్వం మరో 15 రోజుల పాటు పొడిగించింది. పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

డెస్క్

**ఇన్వెస్ట్ భట్టి**

డిసెంబర్ 7 , 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ –2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షా

సమావేశం నిర్వహించిన ఆయన , సమ్మిట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

డెస్క్

**సమీక్ష**

గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ కమిషనర్లు, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, కలెక్టర్లు, జీహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా , విజయవంతంగా నిర్వహించేందుకు భద్రత , ట్రాఫిక్, శానిటేషన్, నిమజ్జన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు.

డెస్క్

**సీతక్క**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌవిటిగూడెంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క పర్యటించి.. హైదరాబాద్‌లో హత్యకు గురైన గిరిజన యువతి , నర్సు ఊకే శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

పిటిసి, భద్రాద్రి

**గౌరవెల్లి**

గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 250 కోట్ల రూపాయలను సద్వినియోగం చేస్తూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ,

ఇరిగేషన్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు.

పిటిసి, సిద్దిపేట

**పొంగులేటి**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే , కేసముద్రం మున్సిపాలిటీ కార్యాలయ భవనానికి , ఇనుగుర్తి, సీరోలు, దంతాలపల్లి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. నారాయణపురంలో దాదాపు 60 ఏళ్లుగా పరిష్కారం కాని అసైన్‌డ్ భూముల సమస్యను పరిష్కరించి , 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూ ఆధార్‌తో కూడిన పట్టాదార్ పాస్‌బుక్కులను మంత్రి పంపిణీ చేశారు.

పిటిసి, మహబూబాబాద్

**బక్కి**

వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామిని ఈ ఉదయం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబు నాయక్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...

బైట్ - బక్కి వెంకటయ్య

పిటిసి, సిరిసిల్ల

**వర్షాలు**

సెప్టెంబర్‌లో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కేంద్ర భూవిజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ పరిధిలోని ఐఎండీ సెప్టెంబర్ నెల వాతావరణ నివేదికను ఈరోజు విడుదల చేసింది. దీర్ఘకాలిక సగటు

వర్షపాతంలో 91 శాతం కంటే తక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని , పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ సాధారణం కంటే అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

పీఎన్

**బీజేపీ ఆల్**

బీజేపీ రాష్ట్ర కార్యాలయం , నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, 22ఏ భూముల అంశాలపై ప్రశ్నించినందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని , వర్షిత్ రెడ్డి తల్లిని గాయపరచడం దారుణమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేయాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. యువత మద్దతు పెరగడాన్ని జీర్ణించుకోలేకే కాంగ్రెస్ ఇలా చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో అస్తవ్యస్థ పాలన నడుస్తోందని శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

డెస్క్

**మహా లింగార్చన**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిన్న రాత్రి మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.

పిటిసి, సిరిసిల్ల

**రీ సర్వే**

మంచిర్యాల జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా , పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లో రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పిటిసి, మంచిర్యాల

**పోలీస్ యాక్ట్**

ఈరోజు నుంచి ఈనెల 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్-1861లోని సెక్షన్లు 30 , 30(ఎ) అమలులో ఉంటాయని కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు , రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఆయన సూచించారు.

పిటిసి, కామారెడ్డి

**తెలంగాణ**

హైదరాబాద్‌ను దేశంలోనే అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా  ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం ఆగస్టు 19 నుంచి 29 వరకు బ్రిటన్      , అమెరికాల్లో పర్యటించి పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో చర్చలు జరిపింది. అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, సోయాస్, హార్వర్డ్ఆక్స్‌ఫర్డ్ఎంఐటీ, కేంబ్రిడ్జ్ లండన్ బిజినెస్ స్కూల్    ప్రతినిధులతోనూ బృందం చర్చలు జరిపింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యానికి ఈ పర్యటన బలం చేకూర్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

డెస్క్

**శ్రీధర్ బాబు**

సెమీ కండక్టర్ తయారీ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ కంపెనీలను ప్రోత్సహించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ ప్రతినిధులను కోరారు. కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలోని జీఐబీఏ బృందం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ అభ్యర్థన చేశారు. సెమీ కండక్టర్స్ లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడి అవకాశాలను మంత్రి వివరిస్తూ , వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, ప్రోత్సాహకాలతో పూర్తి సహకారం అందిస్తామన్నారు.

డెస్క్

**ఉత్తమ్**

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు , రేపు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ జలశక్తి సదస్సులో తెలంగాణ తన సమగ్ర జలభద్రత నమూనాను దేశం ముందుంచనుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ సదస్సు నేపథ్యంలో సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిన్న మంత్రి సమీక్ష నిర్వహించారు. జలభద్రతపై కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో నిర్దిష్ట కాలపరిమితి గల జాతీయ కార్యాచరణ

ప్రణాళిక రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

డెస్క్

**చేయూత**

చేయూత పింఛన్ల దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపో యిన వితంతువులు, ఒంటరి మహిళలు , దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన వారు దరఖాస్తులు సమర్పించవచ్చునని సూచించారు.

పిటిసి, సిరిసిల్ల

**స్కూల్ గేమ్స్**

హైదరాబాద్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈరోజు ఎల్బీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి బాటలు వేయవచ్చని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.        జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

డెస్క్

**విత్తనాలు**

రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సన్న రకం విత్తనాలకే బోనస్ వర్తిస్తుందని    , రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం        తెలిపారు. ప్రభుత్వం  ప్రకటించిన రకాలనే సాగు చేసుకున్న రైతులు ఈనెల 10వ

తేదీ లోపు విత్తన డీలర్ల వద్ద కొనుగోలు చేసిన బిల్లుల రశీదులు ఉంటే సంబంధిత గ్రామాల ఏఈవోల వద్దకు వెళ్లి ఆన్ లైన్ చేయించుకోవాలని సూచించారు. లేదా గత సీజన్ లో రైతులు సాగు చేసుకుని పండించిన విత్తనాలనే వాడితే స్వీయ ధ్రువీకరణపత్రం ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

పిటిసి, సిరిసిల్ల

**సమీక్ష**

వరంగల్ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే ధ్యేయంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న , NIT మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నగరంలో నీటి సరఫరా, నీటి స్వచ్ఛత, నాణ్యత, పరిమాణం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు.

పిటిసి, వరంగల్

**ఈటల**

తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని , పోలీసులను అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అణచివేత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. నల్గొండలో దాడులను ప్రశ్నించేందుకు , బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆరోపించారు.

డెస్క్